www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 24 జూన్ 2025
5
తిరుపతి



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 38 వినతులు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 38 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 11 మంది తమ సమస్యలు తెలుపగా, 27 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి ఆదేశించామని అదనపు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్ తదితరులు ఉన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

- సమస్యలు పరిష్కరించకపోతే జూలై 9న సార్వత్రిక సమ్మె: కందారపు మురళి
- అంగన్వాడీలకు జీతాలు పెంచాలి : సిఐటియు
- మా పాఠశాలను మా ఊర్లోనే ఉంచండి : గ్రామస్తులు, తల్లిదండ్రులు
- యువత పోరు పేరుతో : వైసిపి నాయకులు



సిసియం నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ ధర్నాలతో దద్దరిల్లిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైసీపీ నాయకులు యువత పోరు పేరుతో పార్టీ కార్యకర్తలను సమీకరించి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వ హాయంలో 42 రోజులపాటు మున్సిపల్ వర్కర్లకు జీతాలు పెంచాలని ఆందోళన చేస్తే అప్పటి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, ఒప్పందం ప్రకారం జీతాలను ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి, మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్లు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎఫ్ఆర్ఎస్ విధానం రద్దు చేయాలి..
ఒకే యాప్ తీసుకురావాలి: కందారపు మురళి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా రాష్ట్రంలో కష్టజీవుల పట్ల, కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరి బాధ్యతా రాహిత్యంగా ఉందని, ఎన్నికలకు ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడటం పరిపాటిగా మారిందని కందారపు మురళి విమర్శించారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం తక్షణం పరిష్కరించకుంటే రాష్ట్రంలో మరో చారిత్రక పోరాటాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏడాదికాలంగా అంగన్వాడీలు, మున్సిపాలిటీ, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ కార్మికులు తదితరుల సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రికి, ఉపముఖ్య మంత్రికి సమయం దొరకడం లేదా అని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకపోతే జూలై 9న సార్వత్రిక సమ్మె చేపడతామని హెచ్చరించారు.

ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ఫేస్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ ఆర్ ఎస్), మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వేతనాలు పెంచాలని, తల్లికి వందనం పథకాన్ని స్కీం వర్కర్లకు అమలు చేయాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) తిరుపతి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పద్మలీల, వాణిశ్రీ, కోశాధికారి రాజేశ్వరి యూనియన్ నేతలతో కలిసి కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్ఓ నరసింహులుకు వినతి పత్రాన్ని సమర్పించారు.

సిపిఎం మద్దతు..

తమ డిమాండ్ల సాధనకై అంగన్వాడీలు చేపట్టిన ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలుపరిచి చిత్తశుద్ధిని చాటుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో..

మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచాలని, తల్లికి వందనం అమలు చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, అధ్యక్షులు వడ్డేపల్లి చంగయ్య, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, వెంకటగిరి అధ్యక్షులు సుబ్బయ్య, కార్యదర్శి ప్రసాద్, రమణయ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మా ఊరి పాఠశాలను మా ఊర్లోనే ఉంచండి..

పాఠశాలల విలీనం పేరుతో తమ ఊరి పాఠశాలను వేరొక ఊరికి మోడల్ స్కూల్స్ పేరుతో మార్పు చేస్తున్నారని, అంత దూరం పిల్లలు వెళ్లి రావాలంటే ఇబ్బందిఅని జిల్లా వ్యాప్తంగా గ్రామాల ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి నిరసనను తెలియజేశారు. జిల్లాలో 500 పైచిలుకు పాఠశాలలను మూత వేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన వందలాదిమంది బాలబాలికలు విద్యకు దూరం అవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విలీన ప్రక్రియకు స్వస్తి పలకాలని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముందు విద్యార్థుల తల్లిదండ్రులు చేపట్టిన నిరసన దీక్షకు మద్దతు ప్రకటిస్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. బాలయ్యపల్లి మండలం, జార్లపాడు గ్రామం, అలిమిలి గ్రామం నుండి, ఎస్ ఎల్ పురం, పల్లం గ్రామం నుండి విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టరేట్ వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు.



నా సంతకం లేకుండానే..



నాగరత్న

మాది ధర్మవరం సస్థలం. నా సంతకం లేకుండానే హౌసింగ్ లో నా ఆధార్‌ను లింక్ చేసి హౌసింగ్ ద్వారా డబ్బులు తినేశారు. నాకు ఇప్పుడు హౌసింగ్ ద్వారా ఇల్లు కట్టుకోలేని పరిస్థితిని తీసుకొచ్చారు. మేము చిన్న కూలి పనులు చేసుకుని బ్రతికే వాళ్ళం. నా ఆధార్ లింక్ అవడంతో నాకు ఎప్పటికీ హౌసింగ్ ద్వారా ఇల్లు కేటాయించలేమని అధికా రులు చెబుతున్నారు. ఎవరో శ్రీనివాసులు అనే వ్యక్తి నా ఆధార్ కార్డు లింక్‌తో హౌసింగ్ ఇల్లును పొందినట్లుగా తెలుస్తోంది. అతను ఎవరో మాకు తెలియదు. ప్రభుత్వ పెద్దలు దయవుంచి న్యాయం చేయాలని బాధితురాలు నాగరత్న కోరారు.

యువత పోరు పేరుతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఏడాదికావస్తున్నా నిధులు విడుదల చేయలేదని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని వైసీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ప్రాంతాలకు చెందిన వైసిపి నాయకుల్లు కలెక్టరేట్ కు చేరుకున్నారు. వివిధ ధర్నాలతో కలెక్టరేట్ ముందున్న జాతీయ రహదారిపై వాహనాలు ట్రాఫిక్ జామ్ లో చిక్కుకుపోయాయి. కలెక్టరేట్‌లో ధర్నాల నేపథ్యంలో పోలీసు విభాగం కట్టుదిట్టమైన భద్రత కోసం ఎక్కువ మంది పోలీసులను కేటాయించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం, ఎస్. జయచంద్ర, మాధవ్, ఆర్. వెంకటేష్, వడ్డిపల్లి చెంగయ్య, నాగరాజు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు ధనలక్ష్మి, శ్యామల, ఇంద్రాణి, నాగరాజమ్మ, ముని కుమారి, ప్రభావతి, నిర్మల, మంజుల, స్వరూప రాణి, పుష్ప, హైమావతి సౌజన్య, రేవతి తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని అన్ని అంగన్వాడీ ప్రాజెక్టుల నుంచి పెద్ద సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.



వైసీపీ నాయకుల యువత పోరు

ఆ ముగ్గురూ మోడీ దత్తపుత్రులే

- హోదా, పోలవరం, విశాఖ ఉక్కుపై వెన్నుపోటు
- హామీల అమలులో బాబు విఫలం
- జగన్ పర్యటనలకు అనుమతులివ్వొద్దు
- పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా శ్రీకాళహస్తిలో మీడియా సమావేశం నిర్వహించిన షర్మిల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : చంద్రబాబు, జగన్, పవన్ కళ్యాణ్‌లు మోడీ దత్తపుత్రులేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి పేర్కొన్నారు. మోడీ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నా దత్తపుత్రులు మాత్రం ఆయనతో అంటకాగుతు న్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బలో పేతంలో భాగంగా సోమవారం తిరుపతి జిల్లా పర్యటనకు వచ్చిన షర్మిల శ్రీకాళహస్తిలో మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పర్యటనల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నిజాయితీగా ఎండగడుతోంది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా, పోలవరం, విశాఖ ఉక్కుపై మోడీ మాటిచ్చి ద్రోహం చేస్తున్నా ప్రశ్నించలేని నీచ స్థితిలో టిడిపి, జనసేన, వైసీపీలు ఉన్నాయని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో చంద్ర బాబు కూటమి విఫలమైందని విమర్శించారు. ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం, రాజధాని నిర్మాణానికి నిధులివ్వకుండా మొండి చేయి చూపుతున్నా బాబు, పవన్‌లు మోడీ భజన చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

జగన్ పర్యటనలకు అనుమతులివ్వొద్దు

మానవత్వాన్ని మరిచి, అధికారమే లక్ష్యంగా జన సమీకరణ– బల ప్రదర్శనలకు దిగుతున్న వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనలకు పోలీసులు అనుమతులు నిరాకరించాలని షర్మిల సూచించారు. పల్నాడు ఘటనలో ఓ వ్యక్తి తన కారు టైరు కింద పడి ప్రాణాలు కోల్పోతున్నా జగన్ కర్కశంగా ముందుకు సాగారని మండిపడ్డారు. జగన్‌కు అసలు పాపభీతి లేదనీ, ప్రాణాలు కోల్పోయిన కార్యకర్త కుటుంబాన్ని కనీసం పరామర్శించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద మందికే అనుమతని పోలీసు శాఖ చెబుతున్నా, వేల మందితో జగన్ బల ప్రదర్శనకు వెళ్లారనీ, ఫలితంగానే ఇద్దరు అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను చూడడానికి వచ్చిన అభిమానులకు సన్ రూఫ్ ఉన్న కారు నుంచి అభివాదం చేస్తే సరిపోయే దనీ, అలాకాకుండా కారు సైడ్ బోర్డు నుంచి అభివాదం చేయడం ద్వారా తొక్కిసలాటకు కారణమయ్యారని ఆరోపించారు. జగన్ తన కాన్వాయ్‌ని నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళు తుంటే పోలీసు శాఖ ఎందుకు ఆపలేకపోయిం దని ప్రశ్నించారు. జగన్‌కు పోలీసులు అమ్ముడు పోయారని విమర్శించారు. వ్యక్తి ప్రాణాలు పోవడానికి కారణమైన జగన్ కారులోని అందర్నీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ పర్యటనకు అనుమతులు ఇవ్వొద్దని సూచించా రు. అనంతరం జిల్లా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకం వాసు కార్డియాక్ కేర్ సొంతం



డాక్టర్ వాసు దేవ శెట్టి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పేద రోగులకు పెన్నిధిగా ఆత్మస్థైర్యంతో అతి తక్కువ ఫీజులతో అత్యాధునిక వైద్యాన్ని ప్రజలకు అందిస్తూ వారి నమ్మకం వాసు కార్డియాక్ కేర్ సొంత మని ఆ హాస్పిటల్ అధినేత ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ వాసు దేవ శెట్టి పేర్కొన్నారు. స్థానిక లీలామహల్ సర్కిల్ వద్దనున్న వాసు కార్డియాక్ కేర్ ఆసుపత్రి వద్ద ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ డాక్టరుగా 22 సంవత్సరాలు సుదీర్ఘ అనుభవంతో, 13 సంవత్సరాల గుండె శస్త్ర చికిత్సలలో అనుభవం గడించి, మెరుగైన వైద్యం ప్రజలకు అందుస్తున్నానని తెలిపారు. ఇప్పటి వరకు తాను నిర్వహించిన ఎంజియో గ్రామ్‌లలో ఎవ్వరికి ఎలాంటి ప్రాణపాయం కలుగలేదన్నారు. ఏంజియోప్లాస్టీ విధానాల్లో (స్టెంట్‌లు వేయడడంలో) అతి తక్కువ మరణా లు (1శాతంకన్న తక్కువ) అని అన్ని సమయాల్లో హామీ ఇవ్వగలనని ధీమా వ్యక్తం చేశారు. లెఫ్ట్ మెయిన్ అండ్ కాంప్లెక్స్ కొరోనరి ఇంటర్వెన్షన్‌పై దక్షిణ కొరియా, సియోల్‌లో ప్రత్యేమైన శిక్షణ గడించినట్లు వెల్లడించారు. గుండెలోని రంధ్రాలు (ఎఎస్‌డి, విఎస్‌డి, పిడిఏ) మూసివేత చికిత్సలు, పేస్‌మేకర్ థెరపీలలో సుదీర్ఘ అనుభవం ఉంద న్నారు. స్విమ్స్ డిఎం కార్డియాలజీ ప్రవేశపరీక్షలో స్టేట్ ప్రథమ ర్యాంకు సాధించి, జనరల్ మెడిసిన్‌లో గోల్డ్ మెడల్ పొందానని తెలిపారు. నిష్ణాతమైన ఏకగ్రతతో తను గడించిన అనుభ వాన్ని రంగరించి, తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో వాసు కార్డియాక్ కేర్‌ను స్థాపించామన్నారు. అతి తక్కువ కాలంలో రోగుల మన్నలను అందుకుని, మహానగరాలలో అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య సేవలను ఆధ్యాత్మిక నగరానికి తీసుకొచ్చి ప్రజల ఆదరాభి మానాలను చురుగొన్నామన్నారు. గుండె పోటును ముందస్తు జాగ్రత్తలతో నివారించవ చ్చని పేర్కొన్నారు. గుండెజబ్బులకు తీసుకో వాల్సిన జాగ్రత్తలు సలహాలు సూచనలు ఆయన క్లుప్తంగా వివరించారు. గుండె మన శరీరంలోనే కణాలు అన్నింటికీ రక్తాన్ని పంపింగ్ చేస్తుంద న్నారు. అన్నింటికి రక్తం ద్వారా ఆక్సిజన్ ఇతర పోషకాలు సరఫరా అవుతున్నాయన్నారు. నిరం తరం పనిచేసే గుండెకు వ్యాధులు రావచ్చుని పేర్కొన్నారు. గుండె కవాటాలు, గుండెలోనే కరెంటు వ్యవస్థ పెరికారియం (గుండె పై ఉండే పొర) కరోనరి రక్తనాళాలు (గుండెకు రక్తాన్ని అందించే రక్తనాళాలు) ఇలా గుండె కండరాలకు రక్తం సరఫరా ఆగిపోవడాన్ని గుండె పోటు (హార్ట్ ఎటాక్) అంటారని వివరించారు. గుండెకు సంబంధించి సంపూర్ణ పరీక్షలు చేయించిన తర్వాత డాక్టర్ సలహా మేరకు నడుచుకుంటే ఏ సమస్య ఉండదన్నారు.

గుండెపోటు లక్షణాలు..

ఛాతి మధ్యలో అసౌకర్యంగా కూడిన ఒత్తిడి బరువు ఉన్నట్లు గాను మెలి పెట్టినట్లు గాను నొప్పి ఉండవచ్చు ఇలా కొన్ని నిమిషాల పాటే ఉంటుంది. ఛాతినొప్పి, వీపు నొప్పి, కడుపు పై భాగంలో నొప్పి, లోపలివైపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మెదడు నొప్పి, తల తిరగడంతో పాటు చెమటలు పట్టడం లాంటి లక్షణాలు ఉంటే గుండె పోటుకు దారితీస్తుంది. ఈ లక్షణాలు ఉన్న వ్యక్తి వెంటనే దగ్గరలో ఉన్న హృద్రోగ నిపుణులను సంప్రదించి చికిత్స పొందాలి. తప్పకుండా మందులు వాడడం, రక్తంలో కొలెస్ట్రాల్ శాతం తగ్గించుకోవడం, వ్యాయామం చేయడం, మొదలైనవి పాటించాలి. గుండెపోటు విషయంలో ఆలస్యం చేయరాదు. గుండెపోటు లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలో గుండెజబ్బులు డాక్టర్ను సంప్రదించి, తగిన వైద్యం చేయించాలన్నారు. గుండెకు సంబంధించి అన్ని రకాల వైద్యం మా ఆసు పత్రిలో అత్యాధునిక సౌకర్యాలతో చేస్తున్నామని తెలిపారు. అత్యాధునిక వైద్య పరికరాలతో, సరి కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో తమ ఆసుపత్రిలో గుండె జబ్బులకు వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు..

కార్డియాక్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుండె జబ్బులపై ఎప్పటికప్పుడు పల్లెలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ వాసు దేవ శెట్టి పేర్కొన్నారు సెప్టెంబర్ 25న వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం బిపి షుగర్ వ్యాధులు ఉచితంగా మందులు పంపిణీ చేశామని పేర్కొ న్నారు. గుండె పోటు హార్ట్ ఎటాక్ సంబంధించిన విశిష్ట సేవలను అందిస్తున్నట్లు, సంబంధిత వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు చేస్తున్నామని తెలిపారు. పూర్తి వివరములకు 0877 2272 666 నంబరును సంప్రదించాలని కోరారు.

ఆసుపత్రి ప్రత్యేకతలు

- సంపూర్ణ గుండె చికిత్స, ఈసిజి
- ఎకో అండ్ కలర్ చిన్నపిల్లల గుండె స్కానింగ్.
- ట్రెప్ట్ టి అండర్1 వెంటిలేటర్ సదుపాయం
- 24 గంటలు ఇంటెన్సివ్ కేర్ సదుపాయం.

సుపరిపాలనలో తొలి అడుగు



అమరావతిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో సుగుణమ్మ, నరసింహ యాదవ్, డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈ ఏడాదిలో సంక్షేమం, అభివృద్ధి పై సమీక్ష, కూటమి ప్రభుత్వం భవిష్యత్ కార్యాచరణపై అమరావతిలో ఏర్పాటు చేసిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ సుగుణమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి నియోజకవర్గంలో నుంచి ముఖ్యమైన ప్రజా ప్రతినిధితో పాటు అధికార యంత్రాంగం పాల్గొంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఏడాది పాలనలో తీసుకొచ్చిన అభివృద్ధి, సూపర్ సిక్స్ పథకాల అమలు, స్వర్ణాంధ్ర విజన్ 2047ను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు.

కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్‌కు 244 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా నలుమూలల నుండి సమస్యల పరిష్కారానికి వచ్చే ప్రతి అర్జీదారునికి నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని జిల్లా రెవిన్యూ ఆఫీసర్ నరసింహులు జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, శివశంకర్ నాయక్,సుధా రాణి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. రెవిన్యూ శాఖకు సంబంధించి 117, పంచాయతీరాజ్ 25, స్కూల్ ఎడ్యుకేషన్ 27 ఇలా 244 అర్జీలు వచ్చాయని అధికారులు ప్రకటించారు.

మా పాఠశాలను విలీనం చేయొద్దు



ఎంపీడీఓ దిలీప్ కుమార్‌కు గ్రామస్తుల వినతి పత్రం

ప్రజాశక్తి -కోట : కోట మండలం, ఉత్తమ నెల్లూరు పంచాయతీ పరిధి, మెయిన్ సెంటర్‌లో ఉన్న ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్ లో గిరిజన, బిసి కులానికి చెందిన పలువురు విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ప్రస్తుతం ఈ పాఠశాలను ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న గమళ్లపాలెం ఎంపీయుపి స్కూలుకు బదిలీ చేస్తారని ఉపాధ్యాయులు చెప్తున్నారు. ఈ విలీనం ఆపాలని తమ పిల్లల క్షేమం కోరి ఇక్కడే చదువుకునేలా పాఠశాలను ఉంచాలని స్థానిక ఎంపీడీవో దిలీప్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ నెల్లూరు పంచాయతీ సర్పంచ్ దువ్వూరు శ్రీలక్ష్మి, ఆకాష్ రెడ్డి, పలువురు గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

కేంద్ర మంత్రికి ముక్కంటి ప్రసాదాలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడును సోమవారం టీడీపీ నాయకులు, శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, టిడిపి యువ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ విజయవాడలోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రమంత్రిని ఘనగా సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలను, జ్ఞాపికలను అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రితో చర్చించారు.

మట్టిని కరిగించి

మింగేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- డిఆర్ఓకి సిపిఎం నాయకుల వినతి



డిఆర్ఓ వినతి పత్రం ఇస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు జైచంద్ర

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

రామచంద్రపురం మండలంలో మట్టి మాఫియాను అరికట్టాలని వారికి సహకరించిన అధికారులపై చర్య తీసుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ ఆధ్వర్యంలో డిఆర్ఓ రామ్మోహన్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.జయచంద్ర తదితరులున్నారు. ఆదివారం సిపిఎం పార్టీ బృందం కొండలను, గుట్టలను తవ్విన ప్రాంతాలను పరిశీలన చేసింది. కొత్త కండ్రిగ, మిట్ట కండ్రిగ, ఎల్విపురం, గణేష్ పురం, రాయలచెరువు, గుండోడు కణం తదితర ప్రాంతాల్లో కొండలను కరిగించి, గుట్టలను తవ్వి ఎర్రమట్టిని దోచుకుంటూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారని విమర్శించారు. నిత్యం భారీ యంత్రాలను తీసుకొచ్చి కొండలు, గుట్టలను తొలిచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన నాయకులు తమ స్వార్థంకోసం పచ్చటి కొండలను తొలిచేయడం దారుణమ న్నారు. ఈ ఎర్రమట్టిని ఇటుక బట్టీలకు, ప్రైవేటు వెంచర్లకు, ఇతర అవసరాలకు అమ్ముకుంటున్నా రని ఆరోపించారు. నిత్యం భారీ టిప్పర్లతో గ్రావె ల్ తరలిస్తున్నప్పటికీ అధికారులు, ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అధికా రులు, మట్టి దొంగలు కుమ్మక్కయి ఎర్రమట్టి అమ్ముకుంటున్నా రన్నారు. ఒక్కొక్క మట్టి టిప్పర్ లోడ్‌ను 20 నుంచి 30 వేల రూపాయల వరకు అమ్ముకుం టున్నారు. రామచంద్రాపురం ఎమ్మా ర్వో ఆఫీస్ ఎదురుగా వందలాది వాహనాలలో గ్రావెల్ వెళు తున్నా ఎమ్మార్వో పట్టించుకోకపోవ డం సోచనీ యమన్నారు. వాల్టా చట్టాన్ని అమలు చేసి, మట్టి ని తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకో వాలని సిపిఎం విజ్ఞప్తి చేస్తున్నదని తెలిపారు.

విశ్వ విద్యాలయాలలో కుల వివక్ష సిగ్గుచేటు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: విశ్వవిద్యాలయాలలో కుల వివక్షత చోటు చేసుకోవడం, అది కూడా ప్రొఫెసర్ స్థాయిలో ఉన్న వారికే జరగడం ఆందోళనకరమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, భగత్ రవిలు ప్రకటనలో తెలిపారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలలోని డైరీ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి వర్మ పై కుల వివక్షత చూపడం మానవతావాదులంతా ఖండించాలన్నారు. ప్రిన్సిపాల్‌ను తక్షణమే తొలగించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల విలీనం ఆపాలి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : పాఠశాల విలీనాన్ని విరమించుకోవాలని మిజూరు పంచాయతీ, బేరి జంగాలపల్లికి చెందిన గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం దొరవారిసత్రం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈఓకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పాఠశాలని తొలగించి, 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెలికాడు ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడం సరికాదన్నారు. పిల్లలు అంత దూరం పోలేరని, వర్షాకాలంలో ఉప్పు కయ్యలు దాటుకొని పోవడం ఇబ్బందని తెలిపారు.

గణాంక శాస్త్ర విభాగంలో సింపోసియా

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు గణాంకశాస్త్ర విభాగం 23 నుండి 29 తేదీ వరకు గణాంకాలు, డేటా సైన్స్‌లో స్థిరమైన ఇవేటివ్ అభివృద్ధి అనే అంశంపై ఒక వారం సింపోజియంను ప్రారంభించింది. తిరుపతి, ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ ఆచార్య వి.వి.రావు ముఖ్యఅతిథిగా హాజరై సెమీ కండక్టర్ తయారీలో గణాంకాలు, డేటా సైన్స్ శక్తిపై కీలక ప్రసంగం చేశారు. యస్వీయు రిజిస్ట్రార్ , ప్రోగ్రామ్ కన్వీనర్ ఆచార్య ఎం.భూపతి నాయుడు నేటి కాలంలో డేటా సైన్స్ ఆవశ్యకతను గురించి మాట్లాడారు. ఉపాధి ప్రయోజనం కోసం డేటా సైన్స్‌లో గణాంకాల ప్రాముఖ్యత గురించి ప్రోగ్రామ్ ఛైర్ పర్సన్ ,సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి వివరించారు.

ఉషశ్రీకి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ చరిత్ర విభాగపు పరిశోధక విద్యార్థిని అన్నగౌని ఉషశ్రీకి డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ఎస్వీయు పరీక్షల నియంత్రణ అధికారి రాజమాణిక్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య జి.విజయ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో "సెలెక్ట్ హిస్టారికల్ అండ్ టూరిస్ట్ సెంటర్స్ ఇన్ అండ్ అరౌండ్ తిరుపతి" అనే అంశంపై సిద్ధాంత గ్రంధాన్ని సమర్పించి నందుకు డాక్టరేట్ ప్రధానం చేసారు. ప్రస్తుతం ఈమె చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ఉషశ్రీ అనేక చారిత్రక అంశాలపై పలు పరిశోధన పత్రాలను ప్రచురించారు.

లాసెట్‌లో ప్రవల్లిక ప్రతిభ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో అన్నమయ్య జిల్లా వాయల్పాడుకు చెందిన, పొలిటికల్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎ.ప్రవల్లిక, లాసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 279 వ ర్యాంక్ సాధించింది. ప్రిన్సిపాల్ డా. టి నారాయణమ్మ విద్యార్థినిని అభినందిస్తూ తన లక్ష్యాలను సాధించాలని ఆశీర్వదించారు. ప్రవల్లిక మాట్లాడుతూ భవిష్యత్తులో గ్రూప్ 1 ఆఫీసర్‌గా రాణించాలని తన లక్ష్యాన్ని వివరించారు. ఈ అభినందన సభలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి సాయి కుమారి, అధ్యాపకులు భారతి, డాక్టర్ విజయ కుమారి, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

యువత పోరుకు వైసిపి నేతలు

ప్రజాశక్తి - నాయుడుపేట: వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు నెల్లూరు కలెక్టరేట్ వద్ద సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో జరిగే యువత పోరు కార్యక్రమంలో పాల్గొనేందుకు నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య క్యాంపు కార్యాలయం వద్ద నుండి సూళ్లూరుపేట నియోజకవర్గం వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు పాలేటి నాగార్జున ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, నాయుడుపేట మండల వైసీపీ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, సూళ్లూరుపేట నియోజకవర్గం వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ, ఓజిలి మండల వైసిపి అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబిఆర్ఎస్ఎం తిరుపతిలోని టీటీడీ ఎస్ పి డబ్ల్యు పాలిటెక్నిక్ కళాశాలలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఈ) మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ రాజీవ్ కుమార్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి. రామి రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థుల సమస్యలపై వినతి సమర్పించారు.

గ్రామీణ శ్రామికుల సర్వే

ప్రజాశక్తి - ఓజిలి: సిఐటియు ఆధ్వర్యంలో గ్రామీణ శ్రామికుల సర్వేను మండల పరిధిలోని అత్తివరం పంచాయితీ కారూరు గ్రామంలో సోమవారం నిర్వహించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సిఐటియు జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద మాట్లాడుతూ కారూరు ప్రజలు చాలా సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. పనికి పోతున్న వారికి ఏడు వారాల నుండి డబ్బులు జమ కాలేదన్నారు. రేషన్ బియ్యం కోసం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అత్తివరం గ్రామంకు వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. కారూరు ప్రాంతం దగ్గరలో కొన్ని పొల్యూషన్ పరిశ్రమల వల్ల వారికి అనేక వ్యాధులు వస్తున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు ఆ గ్రామంపై దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎం.రవి, చనగ చిన్నయ్య, ఎస్.కె అబ్దుల్లా, ఎస్.కె దిలీప్, టి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువును సర్వే చేసి సరిహద్దులు చూపండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఎర్రమరెడ్డి పాలెం చెరువు ఆక్రమణకు గురవుతున్నదని దీనిని వెంటనే సర్వే చేసి ఆక్రమణదారుల నుంచి చెరువును కాపాడాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత కోరారు. చెరువును పూడ్చివేస్తూ ఆక్రమించడానికి కొంత మంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని తహాశీల్దార్లకు తెలుపగా ఎమ్మార్వోలు సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. చెరువు ఆక్రమణపై ఎమ్మార్వో హెచ్చరికలు జారీ చేశారన్నారు.

జీతాల బకాయిలు చెల్లించండి

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ పారిశుద్ధ్య కార్మికుల తరపున మెడికల్ ఆఫీసర్ హరి ప్రసాద్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. వెంటనే పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకుంటే పెద్ద ఎత్తున నిరసన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిల, మేత, దేవా, కర్పగం, శాంతి, చిలకమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ, ఆర్ అండ్ బి స్థలాలు అన్యాక్రాంతం

- ప్రైవేట్ సంస్థలకు ఆసరాగా అధికారులు
- ఆక్రమణలపై నామ మాత్రపు చర్యలు
- ఇబ్బంది పడుతున్న పట్టణ ప్రజలు

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలో ప్రస్తుతం ఆక్రమణల పర్వం నడుస్తోంది. అధికారులు తమకేమీ పట్టనట్టు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో నిర్మాణదారులు ప్రభుత్వ స్థలాలనే కాదు, మునిసిపాలిటీ కాలువలను సైతం ఆక్రమించేసి వాటిని శాశ్వతంగా మూసివేస్తున్నారని పలువురు గోల పెడుతున్నా అధికారుల చర్యలు నామమాత్రంగానే ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతి జిల్లా, నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో మున్సిపాలిటీ ఆర్ అండ్ బి స్థలాల తోపాటు, డ్రైనేజీ కాలవలు సైతం ఆక్రమణకు గురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని మేనకూరులో సెజ్‌లో అంతర్జాతీయ పరిశ్రమలు ఏర్పడడంతో నాయుడుపేటకు ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చింది. మేనకూరు సెజ్ లోని పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తుండడంతో నాయుడుపేట పట్టణంతో పాటు చుట్టుపక్క ప్రాంతాల్లోని స్థలాల ధరలకు భారీగా రెక్కలు వచ్చాయి. దీనితో ఖాళీగా ఉన్న ఆర్ అండ్ బి, మున్సిపాలిటీ స్థలాలను సైతం భవన నిర్మాణ యజమానులు ఆక్రమిస్తున్నారు. కొందరు భవన



కాలువపై బండలు వేసి, పార్కింగ్ టైల్స్ వేసుకుంటున్న దృశ్యం

నిర్మాణదారులు తాము నిర్మించబోయే భవన నిర్మాణాలకు మున్సిపాలిటీలో రెసిడెన్షియల్ ప్లాన్ అప్రూవల్ తీసుకొని కమర్షియల్ భవన నిర్మాణాలు చేపడుతున్నారు. దీనికి తోడు భవన నిర్మాణాల ముందు ఉన్న సుమారు 15 అడుగుల ఆర్ అండ్ బి, మున్సిపాలిటీ స్థలాలను ఆక్రమించి పార్కింగ్ టైల్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే డ్రైనేజీ కాలవలపై స్లాబు, బండలు వేసి మూసి వేస్తున్నారు. దీనితో పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీ కాలవలను శుభ్రం చేసే వీలు లేకపోవడంతో, మురుగు నీరు రోడ్లపై ప్రవహించడం తోపాటు దోమల బెడద ఎక్కువైనదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశ విదేశాల నుండి వివిధ రకాల వస్తువులు, పరికరాలను తీసుకునే వెళ్లే భారీ వాహనాలు నాయుడుపేట పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు నుండి ఎల్ ఏ సాగరం, లోతువాని గుంట,పిచ్చిరెడ్డి తోపు మీదుగా పార్క్ సెంటర్ నుండి మేనకూరు సెజ్‌కు చేరుకుంటున్నాయి. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ రహదారి ఆక్రమణలతో కుంచించుకు పోతుంది. పిచ్చిరెడ్డి తోపు ప్రాంతంలో నూతన భవన నిర్మాణాలు చేపడుతున్న వారు ఆర్ అండ్ బి, మున్సిపల్ స్థలాల ఆక్రమించి పార్కింగ్ టైల్స్ వేసుకుంటున్నారు. ఈ సమస్యను ఆర్ అండ్ బి, మున్సిపాలిటీ వారి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన చూస్తున్నాం.. పట్టించుకుంటాం.. అన్న సమాధానాలు తప్ప ఆక్రమణదారులపై చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మున్సిపాలిటీ, ఆర్ అండ్ బి స్థలాల ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు ఆపాలి

ప్రజాశక్తి - నాగలాపురం: నాగలాపురం మండలం, కడివేడు రెవిన్యూకు సంబంధించి రాజుల కండ్రిగ పంచాయతీలో కొంతకాలంగా తమిళనాడుకు అక్రమంగా తరలింపు జరుగుతోందని, ఆ గ్రావెల్ క్వారీని వెంటనే రద్దు చేయాలని నాగలాపురం టీడీపీ నాయకులు సోమవారం తహాశీల్దార్ హనుమాన్ నాయక్‌కు, ఎస్సై సునీల్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రావెల్ మట్టిని పెద్దపెద్ద యంత్రాలతో అనుమతి లేకున్నా రాత్రింబగళ్లు తరలిస్తున్నారని, మైన్స్ అండ్ రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ క్వారీని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ శెట్టి, ప్రసాద్ రాజు, ఎండి కుమార్, చంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే షాపులు నడుపుతున్నాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎక్సైజ్ శాఖ ఇచ్చిన నిబంధనల ప్రకారమే మద్యం షాపులను సమయపాలనతో నిర్వహిస్తున్నామని, కొందరు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం ఇప్పటికే నష్టపోయి వ్యాపారాలను కొనసాగిస్తున్న తమను లక్ష్యంగా చేసుకోవద్దని లైసెన్సుడ్ మద్యం దుకాణాల యజమానులు విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా లైసెన్సుడు మద్యం దుకాణ యజమానులు సురేంద్రబాబు నాయుడు, రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే మద్యం షాపు లైసెన్సును తగ్గించుకోవడానికి లక్షలు పోసి టెండర్లు వేసి నష్టపోయి ఒక షాపును దక్కించుకున్న వారు, ఒక్క షాపు కూడా రానివారు ఉన్నారన్నారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం మద్యం షాపు లైసెన్స్ దక్కించుకున్న తాము కొరియర్ సర్వీసుల మారిపోయామని, నష్టాలను చవిచూస్తున్న తమను రాజకీయాలకు వాడుకోవడం దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ బాధలను అర్ధం చేసుకుని పర్మిట్ రూములను కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో లైసెన్సుడు మద్యం దుకాణ యజమానులు వినాయక చౌదరి, సుబ్బానాయుడు, గోపీనాథ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎస్వీ యూనివర్సిటీ సోమవారం విడుదల చేసిన డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాలలో ఆక్స్ ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పట్టణ, యూనివర్సిటీ స్థాయిలో అన్ని గ్రూపులలో అగ్రస్థానాలను కైవసం చేసుకున్నట్లు కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి తెలిపారు. బీఎస్సీ (హానర్స్) ఎం.ఎస్.సీఎస్ విభాగంలో గ్రూపులో బి.హారిక (8.39), పి.నరేంద్ర (8.27), జి.తేజస్విని (8.18), ఎం.పి.సీఎస్ విభాగంలో టి.ముని క్రాంతి (8.38) ఎస్. చైతన్య (8.11) తెమోజీ (7.92) పాయింట్లతో యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారన్నారు. బీఎస్సీ (బయోటెక్నాలజీ హానర్స్) గ్రూపు నందు కె.పావని (9.22) పి. ఆసిఫా (8.94) కే.లిఖిత శ్రీ (8.78), బీకాం (హానర్స్) గ్రూప్ నందు సింధు ప్రియా (9.02) సీహెచ్ నీలావతి (8.80), రాజేశ్వరి (8.57) పాయింట్లతో యూనివర్సిటీ స్థాయిలో ప్రధమ, ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారని తెలిపారు. డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మధుసూదన్ రెడ్డి అభినందించారు.



P HARIKA(8.39) P NARENDRA(8.27) G TEJASWINI(8.18)
T MUNI KRANTHI(8.38) S CHAITHANYA(8.11) THENMOJI(7.92)
K PAVANI(9.22) P HASEEFA(8.94) K. LIKHITHA SRI(8.78)
J SINDU PRIYA(9.02) CH NEELAVATHI(8.80) E RAJESWARI(8.57)

రోడ్డు ప్రమాదంలో గిరిజన మహిళ మృతి



మృతి చెందిన ఐశ్వర్య

ప్రజాశక్తి - సత్యవేడు: అంబికాపురం-ఎంజి నగర్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో, పన్నూరు సబ్‌స్టేషన్, గిరిజన వాడకు చెందిన మహిళ ఐశ్వర్య(18) మృతి చెందింది. మామిడి పంట కోయడానికి కొందరు కూలీలు ట్రాక్టర్లో ప్రయాణిస్తుండగా ఎదురుగా వేగంగా వస్తున్న టిప్పర్‌ను తప్పించడానికి ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా పక్కకు తిప్పగా కూలీలందరూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో కూలీలు స్వల్ప గాయాలతో బయటపడగా, ఐశ్వర్యకు బలమైన గాయాలయ్యాయి. ఆమెను వెంటనే సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం తెలుసుకున్న సీపీఎం నాయకులు మెలుగు రమేష్ ఆసుపత్రికి చేరుకుని మృతురాలికి సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి భద్రత చర్యలు చేపట్టకుండా మామిడి కోత పనులకు కార్మికులను వాహనాలలో తరలిస్తున్నారన్నారు. గిరిజన బాలిక ఐశ్వర్య మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం మృతురాలు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఎస్సై రామస్వామి ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

తహాశీల్దార్ కార్యాలయం వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు మండలం, కొత్తపాలెం గ్రామానికి చెందిన సరస్వతి అనే మహిళ సోమవారం సాయంకాలం తాసిల్దార్ కార్యాలయంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది. సమయానికి అక్కడఉన్న పోలీస్ సిబ్బంది ఆమెను శాంతింప చేశారు. గతంలో ఏపిసీకి తన భూమిని కేటాయించడం జరిగిందని, తనకు రావాల్సిన నష్టపరిహారం రాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. 6 సంవత్సరాలుగా ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తన గోడు అధికారుల పట్టించుకోలేదని తెలిపింది. తాసిల్దార్ శ్రీదేవిని, ఎమ్మార్వోని వివరణ కోరగా సదరు మహిళ పేరుతో భూమికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేవని కేవలం అనుభవం మాత్రమే ఉండడంతో ఆమెకు నష్టపరిహారం అందలేదన్నారు. బాధితురాలు రికార్డులు తారుమారు చేశారని ఆరోపిస్తోంది. అనంతరం తాసిల్దార్ శ్రీదేవి వాటికి సంబంధించి రికార్డులు పరిశీలించి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తెలిపారు.

తిరుపతిలో ఒలంపిక్ ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అంతర్జాతీయ ఒలంపిక్ డే పురస్కరించుకుని తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి మహతి ఆడిటోరియం వరకు సోమవారం భారీ ప్రదర్శన (ఒలంపిక్ ర్యాలీ) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప విద్యాశాఖ అధికారి కే బాలాజీ, గౌరవ అతిథులుగా తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్, ప్రత్యేక ఆహ్వానితులుగా డిఎస్‌డిఓ శశిధర్‌లు హాజరై ఒలంపిక్ జ్యోతిని వెలిగించి, ర్యాలీ ప్రారంభించారు.

బీసీ హాస్టల్ రోడ్ నిర్మాణానికి చర్యలు తీసుకోండి : జెవివి

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంటం మండలంలో బీసీ హాస్టల్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సోమవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారానికి మండల కార్యదర్శి కుప్ప స్వామి, విద్యా వికాస వేదిక కన్వీనర్ ఓ.వెంకటరమణలు వినతులు ఇచ్చారు.

కుల వివక్ష చూపిన ప్రిన్సిపాల్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో డైరీ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రవి వర్మ పై కుల వివక్షకు పాల్పడ్డ కళాశాల ప్రిన్సిపాల్‌ను ఆ పదవి నుండి తొలగించాలని, అతని పై కేసు పెట్టి అరెస్టు చేయాలని ఐడీజేఎన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు డి.కిరణ్ డిమాండ్ చేశారు. ఐడిజేఎన్ నాయకులతో కలసి శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ కళాశాల వద్ద కులవివక్షతకు గురైన అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను సోమవారం కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఐడిజెఎన్ రాయలసీమ ఆర్గనైజ్ సెక్రటరీ హరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం తిరుపతి నగర నూతన కమిటీని మహాసభకు హాజరైన ప్రతినిధులు ఎన్నుకున్నారని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవ్ తెలిపారు. నూతన అధ్యక్షులుగా బి. శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా పి.చిన్న, నారాయణ స్వామి, చిన్న వెంకటయ్య, కార్యదర్శిగా టి. దాసు, సహాయ కార్యదర్శులుగా సుందరం, మోదీన్, జనార్దన్, కోశాధికారిగా గణేష్‌లను ఎన్నుకున్నారని తెలిపారు.



అధ్యక్షులు బి.శ్రీరాములు
జిల్లా కార్యదర్శి దాసు

కారును మెల్లగా నడపమన్నందుకు.. దళితులపై దాడి



గాయపడ్డ శివకుమార్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : కారును మెల్లగా నడపమన్నందుకు మెటాలియాన్ అలాయ్స్ ప్రైవేటు పరిశ్రమ ప్లాంట్ ఇన్చార్జి తన అనుచరులతో కలిసి దళితులపై దాడి చేశారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనపై బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి మండలం వెలంపాడు గ్రామానికి చెందిన దందోలు పరమేశ్వరయ్య కుమారుడు దందోలు శివకుమార్ (25) ఫోటోగ్రాఫర్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం వెంకటగిరికి వెళ్లి ఫోటో షూట్ చేసి ద్విచక్ర వాహనంలో రాత్రి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో వాంపల్లి వద్ద మెటాలియాన్ అలాయ్స్ ప్రైవేటు పరిశ్రమ ప్లాంట్ ఇన్చార్జి జితేంద్ర కారును అతి వేగంగా నడుపుకుంటూ వెళ్లాడు. ఈ విషయంపై శివకుమార్, అతని తండ్రి పరమేశ్వరయ్య పరిశ్రమ వద్దకు వెళ్లి జితేంద్రను నిలదీశారు. కారును నెమ్మదిగా నడపాలని సూచించారు. దీంతో కోపోద్రిక్తుడైన జితేంద్ర తన అనుచరులతో కలిసి శివ కుమార్, పరమేశ్వరయ్యలపై దాడికి దిగారు. ఈ దాడిలో శివకుమార్‌కు బలమైన గాయాలయ్యాయి. గాయపడ్డ శివకుమార్‌ను బంధువులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అయితే శివ కుమార్, ఆయన తండ్రి పరమేశ్వరయ్యలే పరిశ్రమ సెక్యూరిటీ పాయింట్ అద్దాలు ధ్వంసం చేశారంటూ పరిశ్రమ యాజమాన్యం పోలీసులకు 100 ద్వారా ఫిర్యాదు చేయడం గమనార్హం.

జితేంద్రపై చర్యలు తీసుకోవాలి: సీఐటీయూ

వెలంపాడు దళితులపై దాడి చేసిన జితేంద్ర, అతని అనుచరులపై అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివ కుమార్, పరమేశ్వరయ్యలను సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, వెంకటేష్ లు పరామర్శించారు. ఉపాధి కల్పిస్తామని పరిశ్రమ పెట్టి, స్థానికులపైనే దాడి చేస్తారా అంటూ వండిపడ్డారు. సీసీ కెమెరాలను ఆఫ్ చేసి దాడి చేయడం కుట్రపూరితమన్నారు.


మెటాలియన్ పరిశ్రమ కార్మికుడికి గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి రూరల్ మండలం వెలంపాడు వద్ద ఉన్న మెటాలియన్ అలాయ్స్ ప్రైవేటు పరిశ్రమలో కాలుతున్న బొగ్గు మీద పడటంతో ఓ కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అమిత్(26) గురువారం రాత్రి లెడ్ బ్రాయిలర్ వద్ద పనిచేస్తుండగా కాలుతున్న బొగ్గు శరీరంపై పడింది. దీంతో అమిత్ తీవ్రంగా గాయపడ్డాడు. నలభై శాతం కాలిన గాయాలతో ఉన్న అమిత్‌ను పరిశ్రమ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తోంది. పరిశ్రమ కార్మికులకు భద్రతా సౌకర్యాలను కల్పించకపోవడంతోనే అమిత్‌కు ఈ పరిస్థితి తలెత్తిందని సహచర కార్మికులు వాపోయారు. అమిత్ ప్రస్తుతం బాగానే ఉన్నాడనీ, మరో వారం రోజులు గడిస్తే గానీ ఏమి చెప్పలేమని వైద్యులు తెలిపారు.

రేషన్ డీలర్లతో సమావేశం

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ కటారి జయ జయ రావు అధ్యక్షతన సోమవారం రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తహాశీల్దార్ డీలర్లకు రేషన్ అందించే విషయంలో పలు సూచనలు చేశారు.

లేనేలేదు పోటీ 'శ్రీనివాస తేజానే' సాటి



విద్యార్థిని కావ్యకు కరస్పాండెంట్ సుధాకర్ అభినందన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: పోటీ పరీక్షల్లో లేనేలేదు పోటీ.. మాకు మేమే సాటి అంటూ మండలకేంద్రంలోని శ్రీనివాస తేజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ దూసుకుపోతోంది. విద్యార్థులకు అందిస్తున్న సీబీఎస్ఈ, టెక్నో, ఒలింపియాడ్ తరహా కోర్సులు విద్యార్థులను పోటీ పరీక్షల్లో రాటుదేలేలా చేస్తున్నాయి. గత ముప్పై ఏళ్లుగా శ్రీనివాస తేజా సాధిస్తున్న విజయాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ ఏడాది విడుదలైన పది ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించగా, అందరూ 500 కు పైగా మార్కులు సాధించిడం విశేషం. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి 586 మార్కులతో మండల స్థాయిలో మొదటి స్థానం, రాష్ట్రస్థాయిలో ఎనిమిదవ స్థానంలో సాధించినట్లు కరస్పాండెంట్ కండ్రతి సుధాకర్ తెలిపారు. నర్సరీ నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు అందిస్తున్న ప్రత్యేక కోర్సుల ద్వారా సత్ఫలితాలను సాధిస్తున్నామన్నారు. తాము నర్సరీ స్థాయి పిల్లల నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు అందిస్తున్న సృజనాత్మక, గుణాత్మక విద్య వల్లనే మరే విద్యా సంస్థకు అందనంత దూరంలో విజయాలు సాధిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ప్రతి ఏడాది ప్రభుత్వం అందజేసే ప్రతిభ అవార్డుల్లో అగ్రభాగం శ్రీనివాస్ తేజావేనన్నారు. ట్రిపుల్ ఐటీలో కూడా తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు అర్హత సాధిస్తున్నారన్నారు. అన్ని వర్గాల పిల్లలు ఇంగ్లీష్ మీడియం చదువులు చదివేలా అతి తక్కువ ఫీజులతో అడ్మిషన్లు ఇస్తున్నామనీ, 2025-26 విద్యా సంవత్సరానికి ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థుల ఉత్తమ వికాసం 'వికాస్'తోనే సాధ్యం



కళాశాల ఛైర్మన్ పలమాల సుధాకర్



ప్రతిభ చాటిన వికాస్ విద్యార్థులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వికాస్ జూనియర్ కళాశాల కొత్తగా ప్రారంభించడం జరిగినది. ఈ కళాశా లలో ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరములు అడ్మిషన్లు జూన్ 5వ తరగతి నుండి ప్రారంభించబడ్డాయి. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తూ, పోటీ పరీక్షలకు సంసిద్ధులను చేసే విధంగా కంప్యూటర్ శిక్షణ, ఏపీ సెట్ కోచింగ్ మొదలైన అదనపు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన అధ్యాపకులతో పాఠ్యాంశాలు బోధన ఉంటుందని తెలిపారు. కళాశాల ఛైర్మన్ పలమాల సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు వికాస్ జూనియర్ కళాశాలలో చేరి మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని ప్రిన్సిపాల్ హేమచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ మనోహర్, రాము, నాగూర్ బాబు, చంద్రశేఖర్, రమణయ్య, సురేష్ తదితర అధ్యాపకులు కోరుతున్నారు.

క్రైం న్యూస్

ఎర్ర చందనం స్మగ్లర్లు అరెస్టు



ప్రజాశక్తి- చంద్రగిరి, తిరుపతి (మంగళం): శేషాచలం అటవీ పరిధి చంద్రగిరి-శ్రీవారిమెట్టు మార్గంలో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి 15 ఎర్రచందనం దుంగలు, అక్రమ రవాణాకు వినియోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఇన్‌ఛార్జి అధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ఎస్ఐ సి.వినోద్ కుమార్ బృందం ఆదివారం రాత్రి భాకరాపేట రేంజ్‌లోని నాగపట్ల అటవీ పరిధిలోని శ్రీవారిమెట్టు నుంచి చంద్రగిరి వెళ్లే మార్గంలో వాహనాల తనిఖీలు చేపట్టారని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున వేగంగా వచ్చిన ఒక కారు పోలీసులను చూసి ఆగిపోయి అందులోని వ్యక్తులు కారు దిగి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే టాస్క్ ఫోర్స్ పోలీసులు స్పందించి వారిని చుట్టుముట్టి కారును పరిశీలించగా 15 ఎర్రచందనం దుంగలు ఉన్నాయన్నారు. పట్టుబడిన వారు తమిళనాడు వాసులుగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

లారీలో అగ్ని ప్రమాదం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని చెమిర్తి గ్రామ సమీపాన లారీ అగ్ని ప్రమాదానికి గురైన సంఘటన చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ వివరాల మేరకు, గూడూరు మండలం, తుంగపాళెం గ్రామ సమీపంలోని ఓ పరిశ్రమ నుంచి హైడ్రోక్లోరిక్ యాసిడ్ లోడులో లారీ కర్నూలుకు వెళుతోంది. లారీ చెమిర్తి గ్రామ సమీపానికి రాగానే ఇంజన్లో వైర్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో డ్రైవర్ క్యాబిన్, టైర్లు అగ్నికి ఆహుత య్యాయి. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఎవరు గాయపడలేదు. ఈ ప్రమాదం వలన సుమారు రూ.9 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అగ్నిపమాపక శాఖ అధికారి రమణయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రజాశక్తి -వరదయ్యపాలెం: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది పోలీసుల వివరాల మేరకు ముస్లిం పాలేనికి చెందిన హనీఫ్, అతని చిన్నమ్మ పర్వీన్, దస్తగిర్లతో కలిసి అక్కంపేట నుండి వరదయ్యపాలెంకు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో ఎన్నమాలగుంట సమీపంలో ఆటోను అధిగమించపోయి అదుపుతప్పి పడిపోవడంతో వెనుక నుండి వస్తున్న గ్యాస్ లారీ దస్తగిరి హనీఫ్‌లపైనుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో హనీఫ్ దస్తగిరిలకు తీవ్ర గాయాలు కాగా పర్వీన్ చిన్న గాయాలతో తప్పించుకున్నారు. కేసు నమోదు చేసిన స్థానిక ఎస్సై మల్లికార్జున్ విచారిస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రులను ప్రధమ చికిత్స అనంతరం తిరుపతి, రుయా ఆసుపత్రికి తరలించారు.